విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు,మంగళవారం 19,డిసెంబర్ 2023

నిరుద్యోగుల వయోపరిమితి పెంచాలి

ఏఐవైఎఫ్,ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్ఓ గాయత్రి దేవి కి వినతి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : నిరుద్యోగుల వయోపరిమితి 44 సంవత్సరాలకు పెంచాలని విద్యార్థి యువజన సంఘాల రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం అనంతపురం నగరంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ ఎన్ ఎస్ యు ఐ ఆధ్వరంలో డిఆర్ఓ గాయత్రి దేవి కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి ఎన్ఎస్యుఐ జిల్లా అధ్యక్షులు ఓబులేష్ మాట్లాడుతూ చాలా సంవత్సరాల నుండి ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగులు వయోపరిమితి మించిపోయి శాశ్వత నిరుద్యోగులుగా మారుతున్నారు నిరుద్యోగ యువకులు ఉద్యోగాలు భర్తీ కోసం అనేక రూపాలలో ఆందోళన కార్యక్రమాలు చేసిన ఫలితంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 1 గ్రూప్ 2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగుల వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం విడుదల చేసిన గ్రూప్-1,2 పోస్టులు పెంచాలని పేర్కొన్నారు.వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్నటువంటి రెండు లక్షల 30 వేల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ -1,2 ఉద్యోగాల సంఖ్యను పెంచి నియామక నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కోసం ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని,అభ్యర్థుల వయోపరిమితి మించిపోతున్నందున ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ లో వయోపరిమితుని 42 సంవత్సరాల నుండి 44 సంవత్సరాలకు పెంచాలని,ప్రభుత్వ డిగ్రీ మరియు జూనియర్ కళాశాలల లెక్చరర్ పోస్టులకు ఏపీ సెట్ పరీక్షలను నిర్వహించాలని 6సంవత్సరాల నుండి డీఎస్సీ నోటిఫికేషన్ రాలేదని ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి కూడా నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలో భర్తీ చేస్తున్న అసిస్టెంట్,అసోసియేట్ ప్రొఫెసర్ నియమామకాలలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా రోస్టర్ పద్ధతి ప్రకారం భర్తీ కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిరుద్యోగుల వయోపరిమితి పెంచి నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ కుమార్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఉమా మహేష్, నాయకులు వంశీ, మంజు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి మోహన్, నాయకులు లిఖిల్, శ్రీకాంత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు పవన్, ప్రదీప, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ...25 లక్షల వరకు ఉచిత వైద్యం

విశాలాంధ్ర - అనంతపురం వైద్యం : తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం వీడియో కాన్ఫ రెన్స్ నిర్వహించి ఇక నుంచి డా.వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడాన్ని, ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని ప్రారంభించే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ లోని విసి హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్ పర్సన్ మీసాల రంగన్న,రాష్ట్ర నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రమీల, నగర పాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి,ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మంజుల, డిసిసిబి చైర్ పర్సన్ లిఖిత, సిడబ్ల్యాసి చైర్ పర్సన్ మేడా రామలక్ష్మి,జిల్లా మైనారిటీ చైర్ పర్సన్ సైఫుల్ల, మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ ఫయాజ్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా. కిరణ్ కుమార్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, డిఐఓ యుగంధర్, వైద్యఆరోగ్య శాఖ అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-పుట్లూరు: పుట్లూరు మండలం రైతు సంఘం నూతన కమిటీ ఎన్నికోవడం జరిగినది. ఈ కమిటీలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పుట్లూరు మండల గౌరవ అధ్యక్షుడు తలారి బాలగుయ్య,మండల అధ్యక్షులుగా చింతకుంట శివయ్య,మండల ఉపాధ్యక్షుడు చిన్నకృష్ణుడు ,గోపాల్ కృష్ణ ను మండల ప్రధాన కార్యదర్శిగా సత్తార్ గోపాల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గా అరకటివేముల చిన్న కుళ్ళాయప్ప , సహాయ కార్యదర్శిగా నాగయ్య అలాగే మరికొందరిని కమిటీ మెంబెర్స్ గా ఎన్నుకున్నారు. రైతు సంఘం నూతన కమిటీ నాయకులు మాట్లాడుతూ మా పైన నమ్మకంతో రైతు సంఘం భాద్యతలు ఇచ్చిన సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కి జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామికి రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సి.మల్లికార్జునకి మరియు నియోజకవర్గ నాయకులకు ధన్యవాదాలు తెలుపుతూ ఇప్పటినుండి పుట్లూరు మండలం లోని రైతుల, రైతు కూలీల పక్షాన నిలబడి నిరంతరం పోరాటాలు చేస్తామని తెలియజేశారు.

త్రాగునీటి సమస్య పరిష్కరించండి

విశాలాంధ్ర-తాడిపత్రి: మండలంలోని కోమలి గ్రామంలో త్రాగు నీరు రాక దాదాపు 3 రోజులు అవుతుందని త్రాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు మాట్లాడుతూ గ్రామంలో త్రాగునీరు రాక తోటల దగ్గరికి పోయి వేరే గ్రామాలకు వెళ్లి త్రాగునీరు తెచ్చుకుంటున్నాము. అలాగే త్రాగునీటి కోసం ప్రజలు, పాడి పశువులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శి కి నీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు చెప్పినప్పటికీ ఆయన పట్టించుకోకపోగా తమరే మరమ్మత్తులు చేపించుకోండని ఉచిత సలహా ఇచ్చినట్లు గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నేడు తాగునీటి సమస్యపై కోమలి గ్రామ ప్రజలమైన మేము అందరం ఎంపీడీవో కార్యాన్ని ముట్టడిస్తామని అధికారులను హెచ్చరించారు.

వైసీపీ ప్రభుత్వంలో విద్యారంగ అభివృద్ధి శూన్యం

విశాలాంధ్ర-రాయదుర్గం, రూరల్: రాయదుర్గం నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధి నాలుగున్నరేళ్లుగా పూర్తిగా కుంటుపడిందని మాజీమంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. తన 50వారాల సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా బొమ్మనహల్ మండలం, లింగదహల్ గ్రామంలో టిడిపి హయాంలో అప్ గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాల వద్ద సోమవారం ఆయన 36వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల అవసరాలు తీర్చడం కోసం తెలుగుదేశం ప్రభుత్వంలో 12ఎలిమెంటరీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్ గ్రేడ్ చేయించామన్నారు. బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు 10వ తరగతి వరకు విద్యను అందించడానికి తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నానన్నారు. ఉపాధ్యాయుల కొరత కూడా తీర్చామని తెలిపారు.ముఖ్యంగా బాలికల ఉన్నత చదువుల కోసం ప్రత్యేకంగా బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేయించానని తెలిపారు.తాను మంజూరు చేసిన ఉన్నత పాఠశాలల భవన నిర్మాణాలను కూడా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పూర్తి చేయలేని దయనీయ స్థితిలో ఉన్నాడని దుయ్యబట్టారు. పేద విద్యార్థుల కోసం ఎమ్మెల్యే కాపు చేసిన కృషి ఎంటో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు.అక్రమ ఇసుక తరలింపు,కర్ణాటక మద్యం సరఫరా,సహజవనరులను యధేచ్ఛగా దోచుకోవడం తప్ప నాలుగున్న రేళ్లుగా"కాపు" చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.నాడు-నేడు కింద ఎన్ని స్కూళ్లు మంజూరు చేయించావో, ఎంత మంది కొత్త ఉపాధ్యాయులను నియమించావో, ఎన్ని జూనియర్ కళాశాలలను మంజూరు చేయించావో చెప్పాలని "కాపును" డిమాండ్ చేశారు.

తనపై నిరాధారమైన ఆరోపణలు తగదు

విశాలాంధ్ర - తాడిపత్రి : తనపై పత్రికలలో ఎలాంటి ఆధారాలు లేకపోయినా నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పత్రికా ముఖంగా వెల్లడించారు. సోమవారము విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎర్రగుంటపల్లి గ్రామం వద్ద తాను దాదాపు 15 సంవత్సరాల కిందట భూమి కొనుగోలు చేశాను. తన భూమి ప్రక్కలోనే ఆ గ్రామానికి చెందిన తాను భూకబ్జా చేస్తున్నానని ఆరోపణ చేస్తున్న వ్యక్తి భూమి కొనుగోలు చేశాడు. కానీ తన భూమి నా భూమిలో ఉందంటూ గతంలో రెవెన్యూ కార్యాలయాలకు ఇద్దరము తిరిగాము. రెవెన్యూ, జిల్లా సర్వేలు అందరూ కలిసి ఆ గ్రామానికి చెందిన వ్యక్తి భూమి తన భూమిలో లేదని ఆ వ్యక్తి భూమిలో సచివాలయము, నీళ్ల ట్యాంకి ఉన్నాయని రెవెన్యూ అధికారులే నిర్ధారణ పత్రాలు ఇచ్చారు. కానీ ఇప్పుడు తను రాజకీయంగా ఎదుగుతున్నందుకు తనపై బురద చల్లడానికి తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక ఆ వ్యక్తిని అడ్డం పెట్టుకుని తనపై నిరాధారమైన నిందారోపణలు చేస్తున్నారన్నారు. తాను ఎన్నో తాడిపత్రి ప్రజలకు సేవ చేస్తున్నాను. అంతే కాకుండా 1998లో తన సొంత గ్రామమైన వెంకటం పల్లి లో దళితులకు తన సొంత భూమిని ఒక్కొక్క దళితునికి ఒకటిన్నర ఎకరా భూమిని పంచిపెట్టానన్నారు. అలాగే అదే గ్రామంలో దళితులు నివాసం ఉండడానికి దాదాపు 3 ఎకరాలలో దళితులందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేశానని అలాంటి వ్యక్తిని భూ కబ్జా చేయడం తనకు అవసరం లేదన్నారు. తనపై భూ కబ్జా ఆరోపణలు వచ్చాయి. వాటిని నిరూపించడానికి కలెక్టర్ క్షేత్రస్థాయిన పరిశీలించి తనపై ఏ చర్యల కైనా తాను సిద్ధమేనని పేర్కొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-యాడికి: ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గురు ప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా ఉరవకొండ పట్టణం, అంబేద్కర్ కాలనీకి చెందిన వంశరాజు మారెన్న కుమారుడు మల్లికార్జున (26) యాడికి గ్రామానికి చెందిన యశోదతో మూడు సంవత్సరాల క్రితం వివాహము జరిగింది. ప్రస్తుతం వీరు ఉరవకొండలో నివాసం ఉంటున్నారు.కాగా ఆదివారం యాడికి లోని శుభకార్యానికి హాజరయ్యారు. ఇద్దరు భార్యాభర్తలు ఏదో విషయంపై గొడవపడి ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో తన భార్య మాట్లాడడం లేదని మనస్తాపానికి గురైన మల్లికార్జున భార్య యశోద తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానని దగ్గరలో ఇంటి నిర్మాణం లో ఉన్న ఐరన్ పైప్ కి లుంగీ తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే విషయం తెలుసుకున్న మల్లికార్జున భార్య యశోద చుట్టుపక్కల వారి సాయంతో మల్లికార్జున ను కిందికి దింపి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మల్లికార్జున తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం

- మోటార్లకు మీటర్లు..రైతులకు ఉరితాళ్లు
- కరువు సహాయక చర్యలలో ప్రభుత్వం విఫలం
- నాలుగు ఏళ్ల పూర్తయిన జగన్ రైతులకు చేసింది శూన్యం
- పేరుకు మాత్రమే రైతు ప్రభుత్వం...సీపీఐ సహాయ కార్యదర్శి మల్లికార్జున
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందు వెల్లడి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల లో చేసింది శూన్యమని కరువు సహాయక చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలం చెందిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున రైతు సంఘం అధ్యక్షులు గోవిందు పేర్కొన్నారు. సోమవారం ఎస్ వి ఎస్ రెసిడెన్సీలో నియోజకవర్గ సమావేశం వెంకటేశులు అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లు గా మల్లికార్జున గోవిందు హాజరై వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రైతు నిధుల కోసం కేంద్ర ప్రభుత్వంతో కుమ్మక్కై రైతుల మోటార్లకు మీటర్లు బిగించి రైతుల మెడకు ఉరితాలు బిగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని కేంద్ర ప్రభుత్వంతో జగన్ కుదుర్చుకున్న విమర్శలకు ఇది నిదర్శనం కాదా అని వారు ప్రశ్నించారు. అధికారం రాని మునుపు నియోజకవర్గంలో 114 చెరువులో కు నీటిని అందిస్తామని కొందరికి బ్రాంచ్ కెనాల్ కలుపుతూ బీటీపీకి నీటిని తీసుకెళ్లే ప్రాజెక్టును మంత్రి విషెస్ శ్రీ చరణ్ 4:30 ఏళ్ళుగా ఆటకెక్కించిందని ఇప్పుడు ఎన్నికల కోసం హడావుడి చేస్తూ నియోజకవర్గ ప్రజలను నమ్మించే పనిలో భాగంగా కాల్వపనులు ప్రారంభించడం లో ఆంతర్యం ఏమిటి అన్నారు రాష్ట్రంలో తీవ్రమైన కరువు ఏర్పడిందని అహంకారంతో జగన్ రెడ్డి కరువును గుర్తించలేదని ఇప్పటికైనా సిపిఐ రైతు సంఘం ఉద్యమాల ద్వారా కరువు బృందం రాష్ట్రంలో పర్యటించిందని పేదలకు రైతులకు కార్మిక కర్షక ప్రతి ఒక్కరు ఒక కమ్యూనిస్టు ఉద్యమాలతోనే మేలు జరుగుతున్నది వాస్తవం కాదా అన్నారు కరువు మండలాల ప్రకటించి చేతులు బూతు దులుపుకుంటున్నారని కరువు సహాయక చర్యలు చేపట్టి పంటలవారీగా రైతులకు నష్ట పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం కృష్ణ జలాల పంపిణీ పేరుతో ఇచ్చిన ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ తక్షణం ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.అంతేకాకుండా రైతులకు మేలు జరగాలంటే ఒక కమ్యూనిస్టు పార్టీ తోనే సాధ్యమవుతుందని అందులో భాగంగానే ఈ నెల 29న జిల్లా కేంద్రంలో జిల్లా మహాసభలు జనవరి 8,9 తారీఖున విజయనగరంలో జరుగు రాష్ట్ర మహాసభలలో నియోజకవర్గ జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు కార్మికులు, కర్షకులు కూలీలు పెద్ద ఎత్తున హాజరై వైసీపీ రైతు వ్యతిరేక చర్యలను చర్చించి వైసీపీ వైసీపీ పతనానికి కార్యాచరణ రూపొందించుకుందామని వారు పిలుపునిచ్చారు.

నియోజకవర్గ నూతన కమిటీ ఏకగ్రీవం....రైతు సంఘం గౌరవాధ్యక్షులుగా సీనియర్ నాయకులు అదులూరప్ప ఎన్నికి చేసి కమిటీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తూ కమిటీ ఏర్పాటు చేశారు.నియోజకవర్గ అధ్యక్షులుగా నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా నాగభూషణ, ఉపాధ్యక్షులుగా వెంకటేశులు, బిసులప్ప, మంజు, ప్రధాన కార్యదర్శులుగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా రాంబాబు, మంజునాథ్ వీరితోపాటు 21 మంది కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

ఉచిత కరెంటు ఇవ్వాలి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్ : అనంతపురం కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న దోబీ ఘాటుకు ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.లింగమయ్య మాట్లాడుతూ అనంతపురం కలెక్టర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న చెరువు దగ్గర ధోబి ఘాటు నిర్మించారు. దాదాపు 20 సంవత్సరాలుగా సత్యసాయి వాటర్ నుండి సంబంధించిన ఉచిత కరెంటు ఇచ్చారు. ఈ మధ్యకాలంలో అక్కడున్న దోబీ ఘాటుకి సత్యసాయి వాటర్ సంబంధించిన వాళ్ళు కరెంటు ఇవ్వమని చెప్తున్నారు. సోమవారం నగరంలోని స్థానిక పవర్ ఆఫీస్ కి వెళ్లి కరెంటు ఏ ఈ ని కలిసి ఆ ధోబీ ఘాటుకు సంబంధించిన కరెంటు స్తంభాలు దోబీ ఘాట్ వరకు ఇవ్వాలని ఏఈకి వినతి పత్రం అందజేశారు. అనంతరం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కరెంట్ ఆఫీస్ నుండి ఎస్టిమేంట్ వేయించుకొని రండి ఆ కరెంటు సంబంధించిన డబ్బులు నేను చెల్లిస్తానని ఎంపీ చెప్పడంతో యంపికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షులు సి.నాగప్ప, రజక నాయకులు కుల్లాయప్ప, ఒన్నూరప్ప,నాగరాజు,మల్లికార్జున,శ్రీనివాసులు,హనుమంతు, రామన్న, గంగమ్మ, ఆదెన్న, సుంకన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జేబుకు చిల్లుపెడుతున్న రైస్ మిల్ యజమానులు

విశాలాంధ్ర-కణేకల్లు: మండలంలో పండిస్తున్న సోనా మసిరి బియ్యానికి రోజు రోజుకు రైస్‌మిల్ యజమానులు ధరలు పెంచుతున్నారని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు జేబులకు చిల్లు పెడుతున్నారని సిపిఐ మండల కార్యదర్శి గౌస్‌పీర్ అన్నారు.సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించారు.స్థానికంగా ఉన్న అధికారులు, మండల తహసీ ల్దార్, కళ్యాణదుర్గం ఆర్డీవో , జిల్లా డిఆర్ఓ అధికారి విజిలెన్స్ ఎక్సోర్ట్ మెంట్, మొదలగు డిపార్ట్మెంట్ వాళ్ళు, రైస్ మిల్ యజమా నులపై, చర్య తీసుకోవాలని, అలాకాని ఎడల, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, రాస్తారోకోలు చేస్తామని, ప్రతి కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌస్ పీర్, పట్టణ కార్యదర్శి, కే మహబూబ్ బాషా, పట్టణ సహాయదర్శి, మన్సూర్, జీఎం భాష, కనేకల్ మైనారిటీ సోదరులు, పి శర్మాస్ వలి, ఎం సైఫుల్ల, పి హుస్సేన్, నారాయణస్వామి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : ఏపీ మెడికల్ కాంటాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నందు నిరసన దీక్షలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా ఏఐటీయూసీ నాయకులు రాజేస్ మల్లికార్జున, కృష్ణుడు, చిరంజీవి హాజరయ్యారు వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఒక కుటుంబం గడవడానికి 26,000 అవసరమని ఇవ్వాలని, పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల ఒకటవ తేదీన జీతం వేయాలని, కార్మికులను మోసం చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్లిస్టులో పెట్టాలని, ఆప్కాస్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఎం ఓ యు ప్రకారం ఏ వన్ సంస్థ జీతాలు ఇవ్వడం లేదని వారు ఆరోపించారు. వెంటనే బకాయి ఉన్న మూడు నెలలు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మా సమస్యలు పరిష్కారం అయ్యే ంతవరకు పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని కాంట్రాక్టర్లను ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం సహృదయంతో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలని విన్నవించారు. తక్షణమే వారి సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, లక్ష్మి ,కుమార్, శోభ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం ముందర అంగన్వాడీలో 7వరోజు దీక్షను కొనసాగించారు. అంగనవాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు,అంగనవాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి.అంగన్‌వాడీలకు సమాన పనికి సమానవేతనం చెల్లించాలన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గితే చర్యలు

విశాలాంధ్ర - శెట్టూరు: విద్యార్థులకు పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యత తగ్గితే చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి టువాణి దేవి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలో ఉన్న గోకులం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టి రికార్డును, హాజరు పట్టిక లో తనిఖీ నిర్వహించారు అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడి మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించి మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు వంట సహాయకులకు మెలుకువలు తెలియజేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం చేయాలన్నారు.విద్యార్థులకు అందించే కోడిగుడ్లు50 గ్రాముల బరువు ఉండాలన్నారు.మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ వహబ్ విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

బీడీలు ఇవ్వలేదని నూనెతో దాడి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : అనంతపురం జిల్లా,బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో బీడీలు ఇవ్వలేదని చికెన్ కబాబ్ కోసం ఉపయోగించే కాగిన నూనెతో వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని షఫీ అనే వ్యక్తి చిల్లర అంగడితో పాటు చికెన్ కబాబ్ పెట్టుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆగ్రామానికి చెందిన రాజశే ఖర్ అనే యువకుడు బీడీల కోసం వచ్చాడు. బీడీలు తొందరగా ఇవ్వాలని ఒత్తిడి తెచ్చాడు. షఫీ బీడీలు ఇవ్వడంలో అలస్యం చేయడంతో చికెన్ కబాబ్ కోసం ఉపయోగిస్తున్న పామాయిల్ను కాలుతున్న దాన్ని షఫీపై చల్లాడు. దీంతో షఫీకి తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడే ఉన్న షఫీ కుటుంబసభ్యులు అఫీబాతత్సుమ్, రుహీనాతాజ్, అల్లం భాషా, మహ్మద్ ముజ్మల్కు పామాయిల్ చిట్లి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో వీరిని బళ్లారి విమ్స్కు తరలించారు. అయితే షఫీకి తీవ్ర గాయాలు కావడంతో అక్కడే చికిత్స పొందుతున్నట్లు తెలి పారు. వేడిగా ఉన్న నూనెను చల్లడంతో షఫీ కూడా రాజశేఖర్ను గరిటెతో కొట్టినట్లు తెలిపారు. దీంతో బొమ్మనహాళ్ పోలీసులును ఆశ్రయించినట్లు బాధితులు షఫీ కుటుంబసభ్యులు తెలిపారు. ఇరువురిపై విచారించి కేసు నమోదు చేస్తామని బొమ్మనహాళ్ పోలీసులు తెలిపారు.

త్రాగు,సాగు నీళ్లు అందించాలి

విశాలాంధ్ర-కూడేరు: పీఏబీఆర్ ద్వారా త్రాగునీటితోపాటు సాగునీరును మరియు మండలంలోని అన్ని చెరువులకు నీరును వదలాలని సోమవారం కూడేరు మండల కేంద్రంలోని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బీ.గోపాల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కురుగుంట మనోహర్ మాట్లాడుతూ నష్టపోయిన హార్టికల్చర్ మరియు అగ్రికల్చర్ పంటలకు నష్టపరిహారం చెల్లించాలి, రైతుల రుణాలన్నీ రద్దుచేసి కొత్త రుణాలను మంజూరు చేయాలి.రైతాంగ సమస్యలు పరిష్కారం చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల రైతు సంఘం మండల కార్యదర్శి రమణ, మండల నాయకులు మల్ల రాయుడు, వెంకటేష్,ఖాసింపీరా, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఆత్మకూరు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంగనవాడి న్యాయమైన సమస్యల పరిష్కారం చేస్తామని అధికారంలో వచ్చి నాలుగున్నర సంవత్సరం అయినా అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు పూర్తిగా వైఫల్యం చెందారని సిపిఐ ఆత్మకూరు మండలం కార్యదర్శి సనప నీళ్ల పాల రామకృష్ణ విమర్శించారు. సోమవారం ఆత్మకూరు మండలం జాతీయ ఉపాధి హామీ ఆఫీస్ ముందర వద్ద అంగన్ వాడి వర్కర్స్ చేస్తున్న సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల రైతు సంఘం అధ్యక్షులు నారాయణ కార్యదర్శి బి.రామాంజనేయులు, గోవిందు,నరేష్, సర్దాని, రామన్న పాల్గొన్నారు.

డి.హీరేహాళ్: అంగన్వాడీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. నాగార్జున డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లు చేపట్టినటువంటి నిరవధిక సమ్మెకు సిపిఐ పార్టీగా పూర్తి మద్దతు ఇస్తున్నామని, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ ఒక వారం రోజులుగా చేపట్టినటువంటి సమ్మెలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు అంగన్వాడీల సమ్మె రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం రాకపోవడం చాలా బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో ఏపి రైతు సంఘం నరసింహులు, తిప్పేస్వామి, డి, మండల కార్యదర్శి హనుమంతు , అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: అంగన్వాడీ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన నిరవధిక సమ్మె 7వ రోజుకు చేరిన సందర్భంగా శెట్టూరు ఎమ్మార్వో ఆఫీసు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి హెల్పర్ యూనియన్ సిఐటీయు జిల్లా కార్యదర్శి రమాదేవి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ లీడర్స్ ద్రాక్షాయని, విశాలక్ష్మి అంజనమ్మ, వనితమ్మ, గంగాదేవి అంజనమ్మ, వన్నూరక్క మండల వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి టీచర్లు హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: మండల కేంద్రంలోని తాహసిల్దార్ కార్యాలయం ఎదురుగా గత ఐదు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సిపిఎం నాయకులు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం గత 7 రోజులుగా వివిధ రకాలుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు,మంగళవారం 19,డిసెంబర్ 2023

అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

విశాలాంధ్ర -పుట్టపర్తి : ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన స్పందన కార్యక్రమం ద్వారా అర్జీల సమస్యలను వివేకవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో జగనన్న స్పందన (గ్రీవెన్స్) కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డి ఆర్ ఓ కొండయ్య,పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, డిఆర్డీఏ పీడీ నర్సయ్య, గ్రామ వార్డు సచివాలయాలకు ఆర్డినేటర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధించి శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని పారదర్శ కంగా విచారణ చేసి అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్‌లో లేకుండా వేగవంతంగా సమస్యలను పరిష్కరిస్తే జిల్లా కలెక్టరేట్ వరకు అర్జీదారులు రారని క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో 264 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అర్జీదారులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ ఎస్ ఇ గోపాల్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్ భాష, జిల్లా సర్వే ల్యాండ్స్ రికార్డు ఏడి రామకృష్ణ, ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డిపిఓ విజయ్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు...నిర్వహణ మరిచారు

- ▶▶పీకలు కట్టారు.. నీళ్లు పోయడం మరిచారు
- ▶▶అధికారుల పర్యవేక్షణ శూన్యం
- ▶▶ప్రకటనలకే పరిమితం

విశాలాంధ్ర -బత్తలపల్లి: పథకం పేరు : గడపగడపకు మన ప్రభుత్వం, నిధులు ఖర్చు : రూ.8 లక్షలు గుంతల రోడ్లను అధికారులు గుర్తించి సీసీ రోడ్లను నిర్మాణం చేశారు. అయితే వాటిని నిర్వహించాల్సింది మర్చిపోయినట్లు కనిపిస్తుంది. సిమెంట్ రోడ్డు వేసిన తరువాత దాదాపుగా ఇరవై ఒక్క రోజు నీటిలోని క్యూరింగ్ కావాలి అప్పుడే రోడ్డు భద్రంగా ఉంటుంది. గుత్తేదారులు రోడ్డుని వేసి వాటికి నీరు నిలువ ఉండడానికి కూడా పీకల కట్టారు. చుట్టపు చూపుగా ఒకటి రెండు రోజులు నీరు పోసి వదిలిపెట్టిన సంఘటన బత్తలపల్లిలో చోటుచేసుకుంది. ధర్మవరం రోడ్డుకు ఉన్న విద్యాధరి పాఠశాల కాలనీ తగ్గుబాగం ఉండడంవల్ల వర్షాకాలము నీటి నిల్వచేరి స్థానికులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. వాటిని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి దృష్టికి తీసుకు వెళ్లడంతో ప్రజలకు ఇబ్బంది లేకుండా సిమెంట్ రోడ్డు వేయాలని ఆదేశించారు. అధికారులు గడపగడపకు మన ప్రభుత్వం అనే పథకం ద్వారా నిధులను కేటాయించి రోడ్డు నిర్మాణంచేపట్టారు. అయితే నేటికీ దాదాపు 16వ రోజు కావస్తుంది కానీ గుత్తేదారులు క్యూరింగ్ చేయకుండా వదిలిపెట్టడంతో అధికారులు కూడా చూసి చూడనట్లు వెళుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కూడా ఎవరు స్పందించడం లేదని పేర్కొంటున్నారు. వాటి భద్రత ఎంత... సిమెంట్ రోడ్డు వేసిన తర్వాత 21 రోజు నీటి నిలువ చేసి క్యూరింగ్ చేపడితే దాదాపుగా 30 సంవత్సరాలు పైగానే ఆ రోడ్డు భద్రంగా ఉంటుందనిఅధికారులు పేర్కొంటున్నారు. స్థానిక అధికారులు మాత్రం వాటిని మరిచి కేవలం గుత్తేదారుల కనుసైగంలోనే నడుస్తున్నారనేది వీటికి నిదర్శనం. దాదాపు లక్షాధి రూపాయలు నిధులను వృథా చేసినట్లే కనిపిస్తుంది.కనిపించని నాణ్యత... సిమెంటు రోడ్డు అధికారులు దగ్గర ఉండి నాణ్యంగా వేయించాలి.. గుత్తేదారులతో కుమ్మక్కై సంబంధిత అధికారులు నాణ్యత లేకుండా రోడ్లు వేస్తున్నారని ప్రజల నుండి భారీగా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించి సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు క్యూరింగ్ చేయిస్తా : పి ఆర్ జె ఈ రమణయ్య.. గుత్తేదారులతో మాట్లాడి సిమెంట్ రోడ్డు క్యూరింగ్ చేయిస్తానని పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమణయ్య పేర్కొన్నారు. గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా రోడ్లు నిర్మాణం చేపట్టామని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అంగన్వాడీలకు సీపీఐ మద్దతు

విశాలాంధ్ర - పెనుకొండ : పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం అంగన్వాడీలు హెల్పర్స్ తమ సమస్యల కోసం 7వ రోజు ధర్నా నిర్వహించడం జరిగింది, సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగిస్తాం. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ సీన, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, ఏపీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, జిల్లా ఉపాధ్యక్షులు ఉష, జిల్లా కోశాధికారి శ్రీదేవి ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్,జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న ,జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్,సిపిఐ మండల కార్యదర్శి నరసింహ, వెంకటేశు, మల్లికార్జున వెంకట రాముడు, నారాయణ, తిప్పన్న, బాబావల్లి, ఈ సమ్మెకు మద్దతుగా జనసేన నియోజకవర్గ నాయకుడు కుమార్, రాజేష్,ఆశ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు త్రివేణి,రాజేశ్వరి,మడకశిర హిందూపురం పెనుకొండ సోమందేపల్లి ప్రాజెక్టు లీడర్లు బావమ్మ, జయమ్మ ,సావిత్రమ్మ, మాబునిస, జ్యోతి, లావణ్య రమణ, వెంకటేష్, రామచంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాహస యాత్రకు డిగ్రీ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - పెనుకొండ : పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు డిగ్రీ విద్యార్థులు జాతీయ సాహస యాత్రకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డా.జేవివిఎన్ కేశవరావ్ పేర్కొన్నారు.భారత రక్షణ, యువ జన సర్వీసుల శాఖ విభాగం ఆధ్వర్యంలో ఎస్కే యూనివ ర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తరఫున హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని హాట్ కోటి లో పది రోజులు పాటు జరిగే వివిధ పోటీ కార్యక్రమాల్లో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎంపికై పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో బీ.కాం ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్. కావ్య, బి.ఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎల్.మౌనికలు నేషనల్ అడ్వెంచర్ క్యాంప్ కి ఎంపికై, కళాశాల కీర్తిని జాతీయస్థాయిలో ఇనుముడింపచేసినందుకు కళాశాల ఎన్ఎస్ ఎస్ విభాగం అధికారులు డా.కే.జయప్ప, కాంతారావు, రంగనాయకులు, అధ్యాపకులు చెన్నారెడ్డి శ్రీదేవి, ప్రతాప్, హరి, హరీష్, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

45 వ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని కిరికెర గ్రామంలోగల ఎల్.ఆర్.జి. విద్యాలయంలో 45వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సత్య సాయి జిల్లా డి.ఎల్.డి.వో డా.కె. శ్రీ లక్ష్మీ పాల్గొన్నారు. వారి ప్రసంగంలో భాగంగా సంకల్ప బలం గురించి చెప్పిన మాటలు విద్యార్థులను ఎంతగానో ఉత్తేజపరిచాయి. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఎంతగానో అలరించారు.ఈ కార్యక్రమంలో ఎల్.ఆర్.జి. విద్యాసంస్థల చైర్మన్ సుమంత్ రామ్మూర్తి, డైరెక్టర్ నిఖిల్ గోవింద్ రామ్మూర్తి, సెక్రటరీ బాలసుందరం, పాఠశాల హెచ్.ఎం. ప్రసాద్,ఏ.వో.సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా ఆరోగ్యాన్ని ఇస్తుంది

మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి

విశాలాంధ్ర-ధర్మవరం: యోగ అనేది మంచి ఆరోగ్యాన్ని ఇస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ కా చర్ల లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఓకార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాలుగవ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తరఫున గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో శ్రీ సత్యసాయి జిల్లాలోని బాల బాలికలు యోగా కాంపిటీషన్లో పాల్గొన్నారు. జిల్లా తరఫున కనగానపల్లి కస్తూరిబా స్కూలు, ఏపీ మోడల్ స్కూలు, ముదిగుబ్బ మండలం నుంచి ముగ్గురు పిల్లలు ఆ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో మూడవ బహుమతిగా కీర్తన ప్రభావతి సాధించడం జరిగిందని యోగా అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ప్రతిభ చాటిన వారు ఐదు మంది విద్యార్థులకు అభినందించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ తో పాటు ముఖ్య అతిథులు మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు శరీరానికి మనసుకు యోగ ఎంతో అవసరమని వారు తెలిపారు. ఎప్పుడైతే శరీరం దృఢంగా ఉంటుందో, మనసు ఆత్మవిశ్వాసంగా, ఆత్మస్థైర్యంతో ఉంటుందో అప్పుడు ఉన్నత స్థానమునకు చేరుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి, ఫ్రమ్ జర్మనీ వెల్గా శాంతి, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్ రెడ్డి, అనంతపురం జిల్లా యోగా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి చేతులమీదుగా గెలుపొందిన బాల బాలికలకు మెమెంటోలు మెడల్స్ ను వారి చేతుల మీదుగా అందజేశారు.ధర్మవరం యోగా అసోసియేషన్ కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బూత్ లెవెల్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం సోమందేపల్లి మరియు రొద్దం మండలాలకు సంబంధించి ముఖ్య నాయకులు, సర్పంచులు, కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశము నిర్వంచినా మండలం బూత్ లెవెల్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ గ్రామంలో కొత్త ఓటర్లను చేర్పించడం వైఎస్సార్సీపీ నాయకుల యొక్క ఓటర్లను తొలగించిన ఎడల మరల చేర్పించడం బాధ్యతగా పనిచేయాలని ఓటర్లు సక్రమంగా ఉన్నాయా లేదా ఓటర్ లిస్టులో సరిచూసుకోవాలని ముఖ్య నాయకులు, సర్పంచులు, కన్వీనర్లు, కార్యకర్తలకు, కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

ప్రజలే ఎమ్మెల్యేకి బుద్ధి చెబుతారు

- ▶ధర్మవరంలో వైసీపీ పతనం ఇక్కడి నుంచే ప్రారంభం
- ▶ప్రజలు ఈ ప్రభుత్వంలో సంతోషంగా లేరు
- ▶భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్
- ▶పెద్దకోట్ల పంచాయతీలో మొక్కలు పంపిణీ

విశాలాంధ్ర-బ్యూరో శ్రీ సత్యసాయి: తాడిమర్రి మండల ప్రజలే ఎమ్మెల్యేకి బుద్ధి చెబుతారని. ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్ర మంలో భాగంగా ఆయన పెద్దకోట్ల పంచాయతీలో సోమవారం విస్తృతంగా పర్యటించారు. గ్రామానికి వచ్చిన శ్రీరామ్ కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గతంలో తాడిమర్రి మండలంలో చెట్లు నరికే విష సంస్కృతికి ముగింపు పలకాలన్న ఉద్దేశ్యంతో చేపట్టిన మొక్కల పంపిణీ గ్రామంలో వివిధ కారణాలతో వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం భవిష్యత్ కు గ్యారెంటీతో పాటు మొక్కల పంపిణీ కూడా చేపట్టారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్తూ మినీ మ్యానిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే అందులో ఉన్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే మొక్కల పంపిణీ యొక్క ఆవశ్యకత గురించి కూడా వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు పథకాలతో పాటు జనసేన సూచించిన మరో నాలుగు పథకాల్ని కూడా కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ప్రజలకు ఏది మంచిది.. ఏది సాధ్యమవు తుందన్నది పూర్తిగా ఆలోచించిన తరువాతనే ఈ పథకాల్ని తీసుకొచ్చా మన్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. మరోవైపు వైసీపీ ప్రభుత్వంలో ఏఒక్కరూ సంతోషంగా లేరన్నారు. కొన్ని పథకాలు ఇస్తున్నామని మధ్య పెట్టి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ధర్మవరంలో ఎమ్మెల్యే తీరు ఎలా ఉందో చెప్పేందుకు తాడిమర్రి మండల కేంద్రంలో ఇళ్లు కూల్చివేతనే నిదర్శనమన్నారు. ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లను ఉన్నఫలంగా కూల్చి వేశారన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో ప్రజల్ని రోడ్డున పడేశారన్నారు. దీనిని ప్రశ్నిస్తే.. మేము అభివృద్ధికి అడ్డంకి అంటూ తప్పుదోవ పట్టిస్తారని ఫైర్ అయ్యారు. మరోవైపు ఈ మండలంలో చెట్లు నరికే విష సంస్కృతికి వైసీపీ నేతలు మళ్లీ బీజం వేస్తుంటే..ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇప్పటి వరకు ఒక్కసారైనా ఖండించారా అని నిలదీశారు.అందుకే తాను ప్రజల్లో అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతో మొక్కల పంపిణీ చేపట్టినట్టు వివరించారు. ధర్మవరం నియోజకవర్గంలో వైసీపీ పతనం తాడిమర్రి మండలం నుంచే ప్రారంభమవుతుందని శ్రీరామ్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

మున్సిపల్ చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి

విశాలాంధ్ర - ధర్మవరం : నియోజకవర్గ అభివృద్ధి మేరకే ఎమ్మెల్యే కేతిరెడ్డి తన లక్ష్యంగా ఎంచుకుంటూ ముందడుగు వేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని మున్సిపల్ చైర్పర్సన్ కాచర్ల లక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం 28వ వార్డులో "ఆంధ్ర ప్రదేశ్కు జగన్ ఎందుకు కావాలి" అనే కార్యక్రమంనకు వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం 28వ వార్డుకు రాష్ట్ర ప్రభుత్వం డిబిటి ద్వారా సంక్షేమ పథకాలకు అందజేసిన డిస్ప్లే బోర్డును (రూ.37.84 కోట్లు)వారు ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వైస్ చైర్పర్సన్లు మాట్లాడుతూ ఏ ప్రభుత్వము చేయని అభివృద్ధి పనులను నేడు ముఖ్యమంత్రి అభివృద్ధి పరుస్తూ రాష్ట్ర ప్రజల యొక్క మనసులను దోచుకున్నారని అదేవిధంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుటలో ఆయనకు అనే సాటి అని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో నియోజకవర్గ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుపుతూ ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచడాన్ని నియోజకవర్గ ప్రజలు కూడా గమనిస్తున్నారని, ప్రతిపక్షాలు అభివృద్ధిని ఓర్వలేకనే బురద చల్లడం సరి అయిన పద్ధతి కాదని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ వేముల జయరామిరెడ్డి, వార్డు కౌన్సిలర్ సరితల ఆశాబి, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, పట్టణ అధ్యక్షులు బాలిరెడ్డి నీలూరి ప్రకాష్, వార్డు ఇంచార్జు చాంద్ బాషా, సుభాన్ భాష, కౌన్సిలర్లు చింత ఎల్లయ్య, గోరకాటి పురుషోత్తం రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కరీం, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ చికిత్సలకు 25 లక్షలు

విశాలాంధ్ర-పుట్టపర్తి : డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ క్రింద చికిత్సలు చేయించుకోవడానికి 25 లక్షల వ్యయం ప్రభుత్వం పెంచిందని ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్ పి మాధవరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, డీఎంహెచ్వో ఎస్ వి కృష్ణారెడ్డి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ తిపేంద్ర నాయక్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందించడమే కాకుండా ఆరోగ్యశ్రీ క్రింద ఉచితంగా వైద్యం పొందడం ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలపై ఏఎన్ఎంలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందే విధానంపై రూపొందించిన ప్రత్యేక యాప్ తో పాటు కుటుంబంలో కనీసం ఒక వ్యక్తి దిశా యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. జనవరిలో రెండో విడత కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గ్రామ, పట్టణ, వార్డులలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 5.33 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం జరుగుతుందన్నారు. వీటిని ఆయా ప్రాంతాలలో సంబంధిత ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆయా కుటుంబాలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రేపటి నుంచే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల ద్వారా ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి,ఎక్కడికి వెళ్లాలి,ఆరోగ్య సేవలు ఎలా పొందాలి,ఎవరిని అడగాలి, ఇలాంటి సందేహాలు అన్నింటిని ఏఎన్ఎం లు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెలియజేస్తారన్నారు. అనంతరం పలువురికి స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులను జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీ మాధవరెడ్డి పంపిణీ చేశారు. అలాగే కదిరి ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన డాక్టర్ హరికృష్ణ ప్రజలకు అందించిన వైద్య సేవలను అభినందిస్తూ సేవా ఆరోగ్య మిత్ర ప్రశంస పత్రాన్ని అందించి 5000 రూపాయలు నగదును జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు హిందూపురం ఇంచార్జ్ దీపిక రెడ్డి, డిపిఎం డాక్టర్ కుల్లాయప్ప నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం కు చేరుకున్న వైభవ యాత్ర

విశాలాంధ్ర-ధర్మవరం: తిరుమల శ్రీవారి సన్నిధి నుండి సెప్టెంబర్ 25వ తేదీన" ఓం నమో వెంకటేశాయ వెంకటేశ్వర వైభవ యాత్రను" ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆ వైభవ యాత్ర రాష్ట్రంలోని పలు జిల్లాల నుండి ఊరేగింపుగా వెళుతూ ధర్మవరంలకు సోమవారం సాయంత్రం చేరుకున్నది. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వారు ఆర్థిక, హార్దిక భాగస్వామ్యం గా నిర్వహిస్తున్న రు. ఈ వైభవ యాత్ర ఆయా ప్రాంతాలలో చేరుకున్నప్పుడు శ్రీవారి సంకీర్తన భజనలు, కోలాటాలు, ఆటల పోటీలు, బహుమతులు అన్నప్రసాద వితరణ, భక్తులచే స్వామివారి నామ కోటి రచన, లాంటి కార్యక్రమాలు భక్తాదులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. భక్తి భావం పెంపొందించేందుకే ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగానే విజన్ ట్రస్ట్ తిరుమల-తిరుపతి దేవస్థానం సహాయ సహకారాలతో ఆధ్యాత్మిక సేవలకు మానవ సేవలకు కార్యక్రమాలను తగిన ప్రణాళికలను సిద్ధం చేయుటమే మా లక్ష్యం అని వారు తెలిపారు. తదుపరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల మురళీధర్, వాసవి మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులు పొడమల రాగిణి, కాకుమాని కళ్యాణి, కోశాధికారి నల్లపేట మంజు సంయుక్త, మహిళా కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం యొక్క అనుబంధ సంస్థల కమిటీ వారు ఈ వెంకటేశ్వర వైభవ యాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, పట్టణ పురవీధులలో వాహనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ వైభవ యాత్రను చూసేందుకు ధర్మవరం భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు తిరుమల తిరుపతి దేవస్థానములు నిర్వహించుట ఎంతో సంతోషించదగ్గ విషయమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కలవల మురళీధర్, అనుబంధ సంస్థల నిర్వాహకులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: అంగన్వాడి వర్కర్స్ యొక్క దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేంతవరకు మా పోరాటాలు ఆపమని, ప్రాణ త్యాగానికైనా సిద్ధమని సిఐటియు రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు ఓబులు, సత్యసాయి జిల్లా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్,శ్రామిక మహిళ ఉమ్మడి జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడి ధర్మవరం ప్రాజెక్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.చంద్రకళ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు అందరూ కూడా ఏడు రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా ఎమ్మార్వో కార్యాలయం వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలియజేశారు. అనంతరం పట్టణంలోని కాలేజీ సర్కిల్ కళా జ్యోతి సర్కిల్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు చేరుకొని, తమ నినాదాలను వినిపిస్తూ ఆర్డిఓ రమేష్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఓబులు,ఇంతియాజ్,చంద్రకళ, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున మాట్లాడుతూ ఏడు రోజులుగా న్యాయమైన అంగన్వాడీ కార్యకర్తల కోరికలను నేటి ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణం అన్నారు. అహర్నిశలు ప్రభుత్వం యొక్క పథకాలను ప్రజల వద్దకు చేర్చుటలో అంగన్వాడీల యొక్క పాత్ర కీలకమని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ కార్యకర్తల యొక్క సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆదినారాయణ, అయుబ్ ఖాన్, పెద్దన్న, ఎస్షైచ్ భాష మారుతి వెంకటస్వామి పోతక్క దీనా అరుణ రత్నమ్మ అనిత కృష్ణవేణి భువనేశ్వరి లలిత, తాడిమర్రి, ముదిగుబ్బ,కనగానపల్లి,రామగిరి,చెన్నై కొత్తపల్లి,మండలాలకు చెందిన అంగన్వాడీ యూనియన్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు దీక్షలు ఆగవు

విశాలాంధ్ర-ధర్మవరం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ హక్కు చట్టం ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27 ఆఫ్ 23ని వెంటనే రద్దు చేయాలని, మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ దీక్షలు ఆపమని ధర్మవరం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సుబ్బారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణములో5వ రోజు సోమవారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ దీక్షలో న్యాయవాదులు కేసీ.చంద్రమౌళి, బాలసుందరి, బిల్లే రవీంద్ర, ప్రసాద్, రామానాయుడు నిర్వహించారు.అనంతరం అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ చట్టం గూర్చి ప్రజల్లోకి పూర్తి అవగాహన కల్పిస్తామని తెలిపారు.మా సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటాలు సలుపుతూనే ఉంటామని న్యాయవాదులు తెలిపారు. ఈ దీక్షలకు రెడీమేడ్ టెక్స్టైల్స్ అసోసియేషన్,శ్రామిక మహిళ కార్యదర్శులు,పిఎస్యు విద్యార్థి సంఘం నాయకులు,జన విజ్ఞానిక వేదిక వారు దీక్షలో పాల్గొనితమ మద్దతులను తెలియజేశారు.ఈ కార్యక్రమములో సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుత్తును పొదుపుగా వినియోగిద్దాం

విశాలాంధ్ర -ధర్మవరం: విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని విద్యుత్ ఏడి. నరసింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని కొత్తపేటలో గల మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనం తరం ఏడి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వినియోగించుకుంటే భవిష్యత్తు తరాలకు ఎంతో ప్రయోజనం చేకూర్చుతుందని తెలిపారు. విద్యుత్తును అవసరమున్నప్పుడు మాత్రమే వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం. మేరీ వర కుమారి, విద్యుత్ ఏఈలు నాగభూషణ, కొండారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభ

విశాలాంధ్ర-ధర్మవరం : ధర్మవరం ఆర్టీసీ డిపో ఆదాయానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్టిసి ఉద్యోగులు తమ సహాయ సహకారాలను విధుల సేవల రూపంలో అందిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం డిపో గ్యారేజీలో ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ డిపో మేనేజర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం బెస్ట్ ఈ పీకే, బెస్ట్ కే ఎంపిఎల్, ఆర్నింగ్స్ గుడ్ బెస్ట్ మెకానిక్ కు డిపో మేనేజర్ నగదు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికులు వెన్నెముక లాంటి వారిని తెలిపారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను అన్నివేళలా ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తూ, ఆర్టీసీ ఆదాయానికి తమ ద్వారా మరింత ఆదాయాన్ని తెచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా ప్రయాణికుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా సేవాభావంతో తమ విధులను నిర్వర్తించాలని తెలిపారు. ప్రతి ఆర్టీసీ ఉద్యోగికే ఎంపీల్, ఈపీకె తప్పక తీసుకొని వస్తే వచ్చిన ఆదాయములో మరింత లాభం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రయాణికుల సంక్షేమమే మన లక్ష్యము అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశులు, గ్యారేజ్ ఇంచార్జ్ సికిందర్,హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు, అసోసియేషన్ నాయకులు, 35 మంది ఆర్టీసీ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు

విశాలాంధ్ర - ధర్మవరం : పట్టణంలోని ఎస్ఎల్వి మార్కెట్ వద్ద గల సుబ్రహ్మణ్య నాగదేవతల దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్టి పూజ వేడుకలు అత్యంత వైభవంగా భక్తాదుల నడుమ నిర్వహించినట్లు అర్చకులు విజయ్ కుమార్ శర్మ, శంకర్ శర్మ తెలిపారు.వారు మాట్లాడుతూ ఉదయాన్నే భక్తాదుల తాకిడితో ఆలయం కలకలలాడిందని, భక్తాదుల పేరి టన ప్రత్యేక పూజలతో పాటు పాలాభిషేకము,వెండి కవచము సమర్పణ, పుష్పాభిషేకము, నాగ హారతి,నివేదన తదితర కార్యక్రమాలు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమం భక్తాదుల సహాయ సహకారాలతో,పట్టణ ప్రముఖుల సహాయంతో నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు ప్రశాంతంగా ఉండాలని ఎస్సై సురేష్ బాబు తెలిపారు. మండల పరిధిలోని మైలేపల్లి, కానీ శెట్టి పల్లి, గ్రామాలలో సోమవారం సాయంకాలం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి కక్షలు, కార్పెండాలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రాజకీయ పార్టీ నాయకులు గ్రామాల్లో ఐకమత్యంతో ఉండాలని, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు,మంగళవారం 19,డిసెంబర్ 2023

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం చెల్లించాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఉపాధి హామీ పథకం క్రింద పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం 26,000 చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పట్టణంలోని గణేష్ కూడలి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా కూడా ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బంది లేకుండా వారిని కొనసాగించే విధంగా ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే పట్టణాలలో ఉపాధి హామీ పథకం అమలు చేయడం లేదన్నారు. కనీసం 200 రోజులు కూలీలకు పని కల్పిస్తూ 600 రూపాయలు కూలి ఇవ్వాల్సి ఉండగా ఎక్కడ అమలు కాలేదు అన్నారు. అర్హత అనుభవం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు మండల స్థాయిలో బదిలీ సౌకర్యం కల్పించాలన్నారు.ప్రమాదవశాస్తూ మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలకు ఎక్స్గ్రేషియా 10 లక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ ల యూనియన్ అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత లేదన్నారు. వేతనాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టరేట్లో డిఆర్ ఓ కొండయ్యకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, మున్సిపల్ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, బ్యాళ్ల అంజి, పెదపల్లి బాబావలి, ఫీల్డ్ అసిస్టెంట్లు యూనియన్ నాయకులు బాబుల్ రెడ్డి, సురేష్ బాబు, మాధవ రెడ్డి, శివారెడ్డి, చంద్రమోహన్, వేమాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా అర్జీలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం : అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి డిఆర్ఓ గాయత్రి దేవి అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్డీఏ పిడి నరసింహా రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఆర్ఓ ప్రజల నుంచి 403 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ అర్జీలను ఎలాంటి ఆలస్యం లేకుండా నాణ్యతగా సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను ప్రత్యేక దృష్టి సారించి క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపించాలన్నారు. అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుత్తి కోఆపరేటివ్ బ్యాంకు ప్రారంభోత్సవం

విశాలాంధ్ర-పామిడి: పామిడి పట్టణంలో బిబిసి రోడ్ నందు నూతనంగా నిర్మించిన భవనంలో గుత్తి కోఆపరేటివ్ బ్యాంకు ను విశాఖపట్నం కో బ్యాంక్ అధ్యక్షులు స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా గుంతకల్ నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే వెంకట్రాంరెడ్డి,గుంతకల్లు నియోజకవర్గం టిడిపి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్, గుంతకల్లు నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా, హాజరయ్యారు.గుత్తి టౌన్ బ్యాంకు ప్రెసిడెంట్ ఎస్ అబ్దుల్ జిలాన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గుత్తి కో-ఆపరేటివ్ బ్యాంక్ 1923 సంవత్సరం నుండి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ బ్యాంకులో అని సేవలు ఉంటాయి. పామిడి పట్టణంలో గుత్తి కోఆపరేటివ్ బ్యాంక్ ను ప్రారంభించాం ప్రజలందరూ టౌన్ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని తెలియజేశారు.గత కొద్దిరోజులు కిందటే నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్నది ప్రారంభించే సమయంలో ఈ బ్యాంకు ఎనిమిది కోట్లతో మొదలు పెట్టి 2023 కి 190 కోట్లు వ్యాపారం చేసి ప్రజలకు అందుబాటులో ఉంటుంది.ప్రజల అందరికీ ఉపయోగపడే విధంగా వాహనాలకు వ్యాపారస్తులకు చిన్నచిన్న మధ్యతరగతి, వ్యాపారాలు, చేసుకునే బట్టల వ్యాపారస్తులకు కూడా అందరికీ లోన్లు రూపంలో రుణాలు ఇస్తాం తెలియజేశారు,ఈ కార్యక్రమంలో కో బ్యాంకు డైరెక్టర్లు కే నాగరాజు,ఎం కృష్ణ, కె మధుసూదన్ గుప్తా,డి వెంకటేష్, జక్క వీరన్న,సి నాగరాజు, జి వెంకటేష్, ఏ మహబూబ్, డి దాదా, వై.రంగ ప్రసాద్, మహేష్ కుమార్, రాజముద్దీన్, సుధీర్ బాబు, శ్రీనివాసులు, వన్నప్ప, మహేశ్వర ప్రసాద్, పామిడి తెదేపా నాయకులు ఎంఎచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, గౌస్, బి రంగస్వామి,ఎం శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ మారుతీ, వైయస్సార్ నాయకులు జోజోడే కుమార్, ఆసిఫ్, జనసేన మండల కార్యదర్శి దన, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి కళ్యాణోత్సవం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా కన్నుల పండువగ శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం జరిగింది. వేద పండితులు స్వామివారి కళ్యాణం విశిష్టతను భక్తులకు వివరిస్తూ కళ్యాణోత్సవాన్ని జరిపించారు.ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు స్వామివారి కళ్యాణోత్సవం తిలకించడానికి ఉరవకొండ పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు ఆలయ ఈవో కృష్ణయ్య తో పాటు పాలకమండలి సభ్యులు అర్చకులు పాల్గొన్నారు.

స్పందనకు 142 పిటీషన్లు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సోమవారం నిర్వహించిన " స్పందన " కార్యక్రమానికి మరియు గ్రామ సచివాలయాల నుండి జూమ్ ద్వారా స్వీకరించిన మొత్తం పిటీషన్లు 142 స్వీకరించారు. జిల్లా పోలీసు కార్యాలయం స్పందన కార్యక్రమానికి విచ్చేసిన ప్రతీ పిటీషనర్ తో జిల్లా ఎస్పీ గారు మాట్లాడారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా పోలీసు స్పందన విభాగం 9392926803 కు తెలియజేయవచ్చుఅని పేర్కొన్నారు. ప్రజలకు సైబర్ క్రైమ్ కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్ లైన్ వెబ్ సైట్ డబ్ల్యూ డబ్ల్యూ .సైబరక్రైమ్ .గోవ్ .ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్ .సి .ఆర్ .పి) లో మరియు టోల్ ఫ్రీ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయం భాస్కర్ రెడ్డి, దిశ డీఎస్పీ ఆంథోనప్ప, ఎస్బీ సి.ఐ ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

వైసీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పిలుపు

విశాలాంధ్ర - ఉరవకొండ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధే మన పార్టీకి బలమని, గెలుపే లక్ష్యంగా వాటిని ప్రచారం చేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.సోమవారం ఉరవకొండ పట్టణంలోని దేవాంగ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన వైస్సార్సీపీ అనుబంధ సంఘాల ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల, గ్రామ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు గ్రామస్థాయిలో సమన్వయం చేసుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని సూచించారు.మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు అడుగులు వేయాలన్నారు.ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలో అనేక సంక్షేమ పథకాలు ఆమలవుతున్నాయని ప్రతి కుటుంబానికీ ఏదో విధంగా లబ్ధి చేకూరుతుందని, ఈ విషయాలనే పార్టీ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కోరారు. ఈసారి ఉరవకొండ నియోజకవర్గంలో వైస్సార్సీపీ జెండా ఎగరవేయాలని అందుకను గుణంగా సమిష్టిగా పని చేయాలని కోరారు.అనంతరం ఇటీవలే అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యాదర్శులు,ఇతర సభ్యులుగా ఎంపికైన వారిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

ఎస్ఐ ను సన్మానించిన టీడీపీ నేతలు

విశాలాంధ్ర - బొమ్మనహాళ్ : బొమ్మనహాళ్ మండలం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును బొమ్మనహాళ్ మండలం టీడీపీ నాయకులు సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సీనియర్ నాయకులు అప్పారావు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు యర్రగుం ట్ల వెంకటేశులు, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షులు కేశప్ప ఎస్ఐ అంజనేయులును శాలువ కప్పి పూలమాలలతో సన్మానించారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా సహకరిం చాలని ఎస్ఐ ఆంజనేయులు వారితో అన్నారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లీడు శీన, నాగరాజులు, కావలి ప్రభు. గ్యాస్ గోవిందు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, ఆనంద్, సుం కన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలి

విశాలాంధ్ర- శెట్టూరు: మండల పరిధిలోని పలు గ్రామాల నిలిచిపోయిన రోడ్డు పనులు చేపట్టాలని సోమవారం స్పందన అర్జీ ఇచ్చిన బిజెపి మండల పార్టీ నాయకులు అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని కైరేవు, రంగయ్యపాలెం, పలు గ్రామాలను నిలిచిపోవడం వల్ల పలు గ్రామాల నుంచి మండల కేంద్రానికి రావడానికి ఇబ్బంది ఎదుర్కొంటున్నారని గ్రామాల నుంచి పట్టణాలకు పోవాలన్న చాలా ఇబ్బంది పడుతున్నారని,ఈ అన్ని రహదారులు కూడా ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా మంజూరైన నిధుల ద్వారా జరుగుతున్నాయని వీటన్నింటిని ఆడంబరంగా శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఏర్పాటు చేసుకుని అర్ధాంతరంగా ఆపేసారని ఆపేయడం వల్ల ప్రధానమంత్రి గ్రామసభ యోజన నిధులు నిర్వీర్యం అవుతున్నాయని, తొందరగా అర్ధాంతరంగా ఆగిపోయిన రహదారుల పనులను పూర్తిచేసి గ్రామాల ప్రజలు రాకపోకలకు రహదారుల సిద్ధం చేయాలని డిమాండ్ మండల తాసిల్దార్ ఫణి కుమార్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెంకటరమణ స్వామి సీనియర్ నాయకులు నంజుండ రావు జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు చింతర్లపల్లి నాగరాజు యాదవ్ కార్యకర్తలు నగేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యవసర సరుకులు వితరణ

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమంలో నార్పల మండలం ఎలుట్ల గ్రామానికి చెందిన సాయి ప్రగతి, చంద్రశేఖరుల మూడవ సంవత్సరం పెళ్లి రోజు సందర్భంగా శ్రీ మాతృశ్రీ వృద్ధాశ్రమానికి వృద్ధులకు పాలు బ్రెడ్లు నిత్యవసర సరుకులను ఆశ్రయ నిర్వాహకరాలకు అరుణ జ్యోతి కి అందజేశారు. ఆశ్రమ నిర్వాహకురాలు మాట్లాడుతూ దాతలు వధూవరులు మరెన్నో పెళ్లిరోజులు జరుపుకోవాలని వృద్ధాశ్రమం తరపున ఆమె, ఆశ్రమ వృద్ధులు,దంపతులు ఇరువురిని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. దంపతులిరువురు వృద్ధుల సమక్షంలో జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కె మోహన్ నిర్మలమ్మ గణేష్ దివ్యవాణి కే గంగాధర్ కే శివమ్మ, ఆశ్రమం వృద్ధులు,తదితరులు పాల్గొన్నారు.

25 లక్షలతో వైయస్సార్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలు

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: కార్పొరేట్ ఆసుపత్రుల్లో పేదల వైద్య సేవల కోసం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రూ. 25 లక్షలతో వైయస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకాన్ని శ్రీకారం చుట్టిందని మైనారిటీ రాష్ట్ర నాయకులు తుమ్మల షామీర్ భాష, ఓడిసి సర్పంచు గోవిందు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పై ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కమల్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఎంతో ఉన్నతాశంతో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించేందుకు వైయస్సార్ ఆరోగ్య శ్రీ ఉచిత వైద్య సేవా పథకాని రూ.25 లక్షలకు పెంచిందన్నారు. ఈ విషయాన్ని గ్రామీణులకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. వైయస్సార్ ఆరోగ్య శ్రీ పథకం పై ఆన్లైన్ డెమో ద్వారా చిత్ర ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెంట్ పూల రెడ్డప్ప, ఎం.పీ.హెచ్.ఎస్. విజయకుమారి, ఏఎన్ఎం నాగవేణి, ఆశా కార్యకర్తలు అంజలి, బషీర, రాధ, తార తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ పోటీలు

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులోనే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలను సోమవారం అధికారులు నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్ నందు ప్రదర్శించిన ఎజ్ బిట్స్ పోటీలు నిర్వహించగా జిల్లా స్థాయికి పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. మొదటి విభాగం వ్యక్తిగత విభాగం కింద సాత్విక్ బండ్లపల్లి గ్లోబల్ వార్మింగ్ ఇందుకు ఎంపిక కాగా, రెండవది లిఖిత, కొత్తచెరువు సేవ్ వర్క్ సేవ్ ఎనర్జీ అనే వాటి పైన ఎంపికయ్యారు. త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జయచంద్ర ,ఉపాధ్యాయులు ఉమాదేవి, గోపాలకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లో సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పెనుకొండ మడకశిర హిందూపురం నియోజకవర్గం అనేకమంది ధర్నా నిర్వహించడానికి సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్నారు. వారు సుదూర ప్రాంతాల నుంచి వచ్చినందున వారికి కడుపునిండా భోజనం ఏర్పాటుచేసారు.ఈ కార్యక్రమంలో తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు, శ్యాం ప్రసాద్ ,వాసుదేవ రెడ్డి ,ప్రసాద్ ,సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బూత్ లెవెల్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర - పెనుకొండ : పెనుకొండలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం సోమందేపల్లి మరియు రొద్దం మండలాలకు సంబంధించి ముఖ్య నాయకులు, సర్పంచులు, కన్వీనర్లు, కార్యకర్తలతో సమావేశము నిర్వంచినా మండలం బూత్ లెవెల్ కమిటీ సమావేశం లో కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ గ్రామంలలో కొత్త ఓటర్లను చేర్పించడం వైఎస్సార్సీపీ నాయకుల యొక్క ఓటర్లను తొలగించిన ఎడల మరల చేర్పించడం బాధ్యతగా పనిచేయాలని ఓటర్లు సక్రమంగా ఉన్నాయా లేదా ఓటర్ లిస్టులో సరిచూసుకోవాలని ముఖ్య నాయకులు, సర్పంచులు, కన్వీనర్లు, కార్యకర్తలకు, కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి సత్కరణ

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద సోమవారము వైసిపి విద్యార్థి విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి వంశీకృష్ణ యాదవ్ శాలువా కప్పి, పూలమాలవేసి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా సంయుక్త కార్యదర్శి వంశీకృష్ణ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యత అప్పచెప్పినందుకు ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి నా దైవ సమానులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. అలాగే రాబోవు ఎన్నికలలో అందరినీ కలుపుకొని వైసీపీ పార్టీ గెలుపునకు ఎల్లవేళలా కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశవర్ధన్ రెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగన్ తోనే సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - అగళి : జగన్ తోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని సర్పంచ్ సన్నమ్మ రంగప్ప తెలిపారు. మండల పరిధిలోని ఆర్జీహళ్లి గ్రామంలో సోమవారం సచివాలయంలో వై ఎ పి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ సన్నమ్మ రంగప్ప ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ జే సి ఎస్ కన్వీనర్లు మహేంద్ర శివన్న కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బి,దుర్గమ్మ చంద్రప్ప పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు సచివాలయ ఆవరణంలో జెండావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆర్.జి హళ్లి గ్రామపంచాయతీకి మంజూరైన నిధుల వివరాలను బోర్డులో ప్రదర్శించారు. అనంతరం వైఎస్ఆర్సిపి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమ ంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు.2024వ సంవత్సరంలో జరుగు అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రిగా చేసుకొంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు.ఆర్ జి హళ్లి గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం ప్రత్యక్షంగా పరోక్షంగాను దాదాపు 17 కోట్ల ఖర్చు చేసినట్లు గ్రామ సర్పంచ్ సన్నమ్మ రంగప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎంపిటిసి సభ్యులు మంజుల సతీష్, లింగమ్మ బసవరాజు, మండల ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్ రాజ్, విమల సదానంద, ఆరాధ్య ఇరిగేపల్లి హనుమంతరాయప్ప, సర్పంచులు నటరాజ్, లక్ష్మమ్మ హనుమంతరాయప్ప, బసవరాజు, సరస్వతి వెంకటస్వామి, గంటా నాగరాజు, బీసీ సెల్ నాయకుడు లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపును ప్రభుత్వ హాస్పిటల్ దగ్గర ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: జనరిక్ మందుల షాపును ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో ఏర్పాటు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాల రంగయ్య పేర్కొన్నారు.సోమవారం ఉరవకొండ తాసిల్దార్ శ్రీధర్ మూర్తికి స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలోని ఐదు మండలాలలోని ప్రజలు చికిత్సల కోసం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో లేని మందులను ప్రైవేటు మందుల షాపుల్లో తీసుకొచ్చుకోవాలని ప్రభుత్వ వైద్యాధికారులు సూచించినప్పుడు మందులను అధిక ధరలలో కొనుగోలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సరసమైన ధరలతో పాటు నాణ్యతతో కూడిన మందులను పేద ప్రజలకు సరఫరా చేయాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని సూచించిందన్నారు. జనరిక్ మందుల షాపులను ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సూచించినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉరవకొండలో ఏ మూలనో జనరిక్ మందుల షాపును ఏర్పాటు చేశారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మందుల షాపులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి,రైతు సంఘం జిల్లా కార్యదర్శి జ్ఞానమూర్తి,రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.